## భక్తిశ్రద్ధలతో సుబ్రమణ్యషష్టి పూజలు



చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో సుబ్రమణ్యషష్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చనలు అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, ఈవో పి.లక్ష్మారెడ్డి, అర్చకులు జగన్ మోహనచార్యులు, గోపాలాచారి, భవనందశర్మ, నరసింహమూర్తి, రామాచారి, కమిటీ సభ్యులు, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పద్య నాటకోత్సవాలు

చిక్కడపల్లి: ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16వ పద్య నాటకోత్సవాలను నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకుడు లోకం కృష్ణయ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన వివేక్‌నగర్ మాట్లాడుతూ... ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు త్యాగరాయ గానసభలో సంబంధిత ఉత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 2న స్వామియే అయ్యప్ప, 3న పాండవోద్యోగం, పాండవుల ఉపప్లవ్య ఘట్టం, 4న దుర్యోధనుని మయసభ శయన దృశ్యం, 5న సత్య హరిశ్చంద్ర, కాటి సీను నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం నాటక ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు.

## తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హనుమకొండలో ఈనెల 29, 30న జరగబోయే తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మహాసభల పోస్టర్‌ను కార్యక్రమ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ కల్పించిన హక్కులను కాల రాస్తోందని ఆయన అన్నారు. ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. టీపీఎఫ్‌లో పనిచేస్తున్న అనేక మంది రాజ్య నిర్బంధానికి గురై ప్రాణాలు వదిలారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.హరగోపాల్, రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, కో–కన్వీనర్ సంజీవరావు, కడమంచి రాంబాబు, గాదె ఈనయ్య, పీకేఎం జాన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక రంగంలో గద్దర్ పాత్ర ఎనలేనిది

**సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి**

కాచిగూడ: సాంస్కృతిక రంగంలోని కళాకారులను ప్రోత్సహిండానికి తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డు ఇవ్వడాన్ని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి స్వాగతించారు. సాంస్కృతిక రంగంలో గద్దర్ పాత్ర ఎనలేనిదని అన్నారు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, మానవ సంబంధాలను తన రచనలతో ఎంతో మందిని ప్రభావితం చేశారన్నారు. ప్రజలను చైతన్యం చేయటంలో అయనకు ఎవరు సాటిలేరని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోచి – గొంగడి – కర్ర ధరించి ఆట, పాటలతో తెలుగు ప్రజలను నడిపించిన చరిత్ర గద్దర్‌ది అని అన్నారు.

## ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులు పెంచొద్దు

**బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ**

కాచిగూడ: రాష్ట్రంలో ఇంజినీరింగ్, ప్రొఫెషనల్ కోర్సుల ఫీజులు పెంచి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయొద్దని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కళాశాలల ఫీజులు పెంచాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీ కేటగిరి సీట్లను ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలన్నారు. డొనేషన్లు తీసుకునే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫీజుల పెంపునకు తెలంగాణ అడ్మిషన్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ ప్రతిపాదించిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో ఒవైపు ఫీజులు పెంచుతుంటే.. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల బకాయిలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు చెల్లించకుంటే ఫీజుల పోరు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మూడు నెలల రేషన్.. తొలిరోజు పరేషాన్.!

- సర్వర్ డౌన్‌తో ఇబ్బంది పడ్డ రేషన్ డీలర్లు
- గంటల కొద్ది లైన్‌లో నిల్చోలేక అవస్థలు పడ్డ లబ్ధిదారులు
- ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీలో తప్పని తిప్పలు
- కొన్ని దుకాణాల్లో ఒకే నెల సరుకులు ఇచ్చిన వైనం



ఓ రేషన్ దుకాణంలో సర్వర్ డౌన్‌తో మోరాయిస్తున్న మెషిన్లు



సుందర్‌నగర్‌లోని రేషన్ దుకాణం వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

కాచిగూడ/ముషీరాబాద్: పౌర సరఫరాల శాఖ అధికారులు మూడు నెలలకు సంబంధించిన రేషన్‌ను ఒకేసారి ఇవ్వడంతో ఇటు రేషన్ డీలర్లు.. అటు లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని రేషన్ దుకాణాల్లో సర్వర్‌డౌన్ సమస్య తలెత్తింది. కొత్త సాఫ్ట్‌వేర్ రావడం, దీనిపై రేషన్ డీలర్లకు సరైన అవగాహన లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఒక్కొక్కరికి సరుకులు ఇచ్చేసరికి 10 – 15 నిమిషాల వరకు పట్టడంతో లబ్ధిదారులు గంటల తరబడి లైన్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. కొన్ని దుకాణాల్లో కేవలం ఒక నెల సరుకులు ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో డీలర్లకు లబ్ధిదారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రెండు, మూడు రోజుల తర్వాత మళ్లీ రావాలని రేషన్ డీలర్లు చెప్పడంతో చేసేదేమీ లేక లబ్ధిదారులు వెనుదిరిగారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇస్తామని ప్రకటించిన అధికారులు లబ్ధిదారులు ఎక్కువ సంఖ్యలో వస్తారని తెలిసినా దుకాణాల వద్ద కనీస ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం. కనీసం మంచి నీటి వసతి, టెంటు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులకుగురయ్యారు.

### కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఇబ్బందులు...

పౌరసరఫరాల శాఖ అధికారులు కొత్త సాఫ్ట్‌వేర్‌ను ప్రతి రేషన్‌షాపుకు అప్‌డేట్ చేశారు. రేషన్ బియ్యాన్ని కొలిచే తూకానికి బ్లూటూత్ కనెక్ట్ కాకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. సర్వర్ డౌన్ కావడం, ఒకేసారి స్విచ్ ఆఫ్ కావడంతో మళ్లీ లాగిన్ చేసి రేషన్ డీలర్ తంబ్ (వేలిముద్ర), పాస్‌వర్డ్ ఎంట్రీ చేయడానికి అధిక సమయం పట్టింది.

### వేర్వేరుగా వేలిముద్రలు.. లబ్ధిదారులకు ఇబ్బందులు

రేషన్‌కార్డుదారులు రేషన్ బియ్యం తీసుకోవడానికి పలుమార్లు వేలిముద్రలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అందజేసే బియ్యానికి వేర్వేరుగా వేలిముద్రలు తీసుకున్నారు. దానికితో తోడు చెక్కర, గోధుమలు తీసుకోవడానికి సైతం పలుమార్లు స్కానర్‌పై వేలిముద్రలు వేయించుకున్నారని లబ్ధిదారులు తెలిపారు. మూడు నుంచి ఆరు సార్లు వేలిముద్రలు వేయాల్సి వచ్చిందని లబ్ధిదాలు పేర్కొన్నారు.

### రోజుకు 40 మందికే రేషన్ ఇవ్వగలిగాం..

కొత్త సాఫ్ట్‌వేర్ పలుమార్లు మొరాయించడంతో 40 నుంచి 45మందికే బియ్యం ఇవ్వగలిగామని రేషన్ డీలర్లు తెలిపారు. గతంలో ప్రతిరోజు 100–120 మందికి రేషన్ బియ్యం ఇచ్చేవాళ్లమన్నారు. ఈ కొత్త పద్ధతి వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు తెలిపారు.

### సర్వర్‌డౌన్‌తో ఇబ్బందులు



రేషన్ షాపుల్లో సర్వర్ డౌన్ కావడంతో ఇబ్బందులకు గురయ్యాం. షాపుల వద్దే గంటల తరబడి నిల్చోవాల్సి వచ్చింది. అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపడితే ఇన్ని ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి వచ్చేది కాదు.

– అనిల్, నింబోలిఅడ్డ

### ఉదయాన్నే వచ్చాం...



మూడు నెలల సరుకులు ఒకేసారి ఇస్తున్నారని తెలిసి ఉదయాన్నే రేషన్ దుకాణానికి వచ్చాం. రెండు గంటలు గడిస్తే కాని రేషన్ సరుకులు తీసుకోలేక పోయాం. మూడు నెలల రేషన్ ఇచ్చారు. రేషన్ షాపుల వద్ద ఇబ్బందులు లేకుండా చూడాలి.

– స్వప్న, కాచిగూడ

### త్వరగా అందేలా చూడాలి..



పౌర సరఫరాల శాఖ అధికారులు రేషన్‌కార్డుదారులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోవాలి. అందుకు తగ్గట్లుగా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. డీలర్లకు కొత్త సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించాలి. త్వరితగతిన సరుకులు అందేలా కృషి చేయాలి.

– వై.శ్రీనివాస్‌రావు, భోలక్‌పూర్

### విడతల వారీగా కూడా తీసుకోవచ్చు...



రేషన్‌కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఢిల్లీ నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ వల్ల మొదటి రోజు కావడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది. వేలిముద్రలు తప్పనిసరిగా బియ్యం తీసుకునే సమయంలో వేయాలి. మూడు నెలల సరుకులు విడతల వారీగా కూడా తీసుకోవచ్చు. మొదటి రోజు అయినప్పటికీ లబ్ధిదారులు పెద్ద ఎత్తున రేషన్‌షాపులకు వచ్చి బియ్యం తీసుకున్నారు.

– దీప్తి, సర్కిల్–6 ఏఎస్‌వో




సాఫ్ట్‌వేర్ మొరాయించడంతో అరుగులపై కూర్చున్న లబ్ధిదారులు

## బీసీ జాబితాలో లంబాడీలను కలిపేందుకు కుట్ర

- సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్
- 29న సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ



మాట్లాడుతున్న భూక్య సంజీవనాయక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో లంబాడీలను బీసీ జాబితాలో కలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్ ఆరోపించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజీవనాయక్ మాట్లాడుతూ... ఈనెల 29న హైదరాబాద్ నగరంలో సేవాలాల్ సేన 11వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐటీడీఏ కింద ఉన్న మ్యూజియంలలో లంబాడీల అనవాళ్లు కూడా లేకుండా చేశారని అన్నారు. మంత్రివర్గంలో లంబాడీలకు అవకాశం లేకుండా పోయిందన్నారు. లంబాడీ భూములను కూడా గుంజుకుంటున్నారని విమర్శించారు. ఎస్టీలకు ఉన్న 10 శాతం రిజర్వేషన్ కూడా సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడంలేదని అన్నారు. లంబాడీల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ మాలోతు సైదనాయక్, నగర అధ్యక్షులు వి. కళ్యాణ్‌నాయక్, వ్యవస్థాపక సభ్యులు స్వరాజ్‌నాయక్, రాష్ట్ర మాజీ కిషన్‌నాయక్, రమేష్ మహారాజ్, అజయ్, హుస్సేన్, వెంకన్న, రవినాయక్ పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ ప్రతినిధి ఆర్.వీరచారి

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్ రోడ్డులోని ప్రసిద్ధి చెందిన హెబ్రోను చర్చిలో హెబ్రోను సొసైటీ, ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన 58వ అఖిల భారత యౌవనస్థుల కూటములు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా హెబ్రోను కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సొసైటీ ప్రతినిధి బ్రదర్ ఆర్.వీరాచారి మాట్లాడారు. ఆలిండియా యూత్ క్యాంప్‌కు దేశవ్యాప్తంగా క్రైస్తవ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని అన్నారు. హాజరైన ప్రతి ఒక్కరికి మెరుగైన సౌకర్యాలతో పాటు భోజన వసతిని కల్పించాలన్నారు. ముఖ్య ప్రసంగీకులుగా తిరుపతికి చెందిన బ్రదర్ జయరాజు వాక్యోపదేశం చేశారు. సింగపూర్ నుంచి వచ్చిన బ్రదర్ ఐజీయా తిమోతి యువత సన్మార్గంలో నడుచుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. క్రైస్తవం మతం కాదని, ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం హెబ్రోను చర్చి పరిసరాల్లో సువార్త ర్యాలీని నిర్వహించారు. కూటములు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, పోలీసులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ, ట్రస్టులకు చెందిన ప్రతినిధులు జాన్ సుందర్‌రావు, స్టీఫెన్ చిన్నప్ప, ఎం.ఇమ్మానుయేల్, ఆనంద్‌రాజు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


## మున్నూరుకాపులు ఒకే సంఘంగా ఏర్పాటు కావాలి



మాట్లాడుతున్న హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుముల జగన్

కాచిగూడ: రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపులు అందరూ ఐక్యమై ఒకే సంఘంగా ఏర్పడాలని తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుముల జగన్ పిలుపునిచ్చారు. రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్యహాల్‌లో మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరుకాపు మహాసభ, సంఘాలకు సంబంధించిన కేసులన్ని ఉపసంహరించుకోవాలని, అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఒకే సంఘంగా ఏర్పాటు కావాలన్నారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు మున్నూరుకాపు మహాసభ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌తో పాటు 29 మంది ఎన్నికైన కార్యవర్గ సభ్యులు, 22 నామినెటెడ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బండారు శ్రీధర్, మల్కాజి వేణుగోపాల్, అమరం చంద్రశేఖర్, చేపూరి వెంకటేశ్వర్లు, మించు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి చేస్తా



నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జిగా చిలుక నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, గిట్టుబాటు ధరల కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, మార్కెట్ పాలకవర్గం, వ్యాపారులు అభినందనలు తెలిపారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానించిన ఏఐసీసీ సభ్యురాలు కోట నీలిమ తదితరులు

నల్లకుంట: పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు పలువురు అభినందనలు తెలియజేశారు. కంచి పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఆదివారం పద్మారావునగర్ స్కందగిరి దేవాలయంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు సన్మాన సభ జరిగింది. దీనికి ముఖ్య అతిధిగా హాజరైన ఏఐసీసీ సభ్యురాలు కోట నీలిమ, తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వింజమూరి సుధాకర్‌లతో కలిసి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శాలువాతో సన్మానించి, మెడల్స్ అందజేసి మాట్లాడారు.

## కర్తవ్య దీక్షతో విధులు నిర్వర్తించే వారికే గుర్తింపు



ఏఎస్సై బాలకృష్ణ దంపతులను సత్కరిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్

చిక్కడపల్లి: విధులను కర్తవ్య దీక్షతో నిర్వర్తించే వారికి సమాజంతో పాటు పోలీసు విభాగంలో మంచి గుర్తింపు లభిస్తుందని చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ అన్నారు. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై బాలకృష్ణ ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్సై బాలకృష్ణ దంపతులకు వేంకటేశ్వస్వామి ప్రతిమను బహూకరించి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ సత్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ మాట్లాడుతూ.. ఏఎస్సై బాలకృష్ణ మూడు దశబ్దాలుగా మంచి సేవలు అందించి గౌరవం సంపాదించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు నాగరాజు, మౌనిక, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణపై శ్రద్ధ చూపండి

కాచిగూడ: అందాల పోటీలకు ప్రధాన్యం ఇచ్చిన ప్రభుత్వం ప్రకృతి పరిరక్షణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య ఆరోపించారు. ఆదివారం నారాయణగూడలోని సంస్థ కార్యాలయంలో అయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అయినా చెట్ల పరిరక్షణకు పటిష్ఠమైన చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పార్కుల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకురావాలి



గంగరాజుకు చెక్కును అందజేస్తున్న సీజీఎస్ ఎండీ జీంతేందర్‌రావు,ప్రేమ్‌కుమార్

చిక్కడపల్లి: పార్కులను సుందరంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని పీపుల్స్ పార్కు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ జనరేటెడ్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(సీజీఎస్) ఎండీ జీతేందర్‌రావు జట్టు పార్కు అభివృద్ధికి ఆర్థిక సాయాన్ని అందించారు. సంబంధింత చెక్కును అసోసియేషన్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎస్‌ఆర్ నిధుల కింద పర్యావరణ పరిరక్షణకు పార్కులో పచ్చదనాన్ని పెంపొందించడానికి నిధులను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, నారాయణ, ఆంజనేయులు, మురికిగణేష్, శ్రీనివాస్ రావు, థామస్, రజనికాంత్ పాల్గొన్నారు.

## దివ్యాంగుల హక్కుల చట్టం సమర్థవంతంగా అమలు చేయాలి



నగర కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల హక్కుల వేదిక నాయకులు

ముషీరాబాద్: దివ్యాంగుల హక్కుల చట్టం–2016 సమర్థవంతంగా అమలు చేయాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌కు అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు బృందం వినతిపత్రం అందజేసింది. వికలాంగుల హక్కుల చట్టం అన్ని పోలీస్‌స్టేషన్‌లో అమలయ్యే విధంగా చూడాలని, అందులో 92 సెక్షన్‌పై పోలీసులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వికలాంగులపై దాడులు, దౌర్జన్యం, ఆస్తులపై దాడులు, వికలాంగుల హక్కులకు భంగం కలిగిస్తే కేసులు నమోదు చేసి తక్షణమే విచారణ జరిపించాలన్నారు. అలాగే ప్రతి పోలీస్‌స్టేషన్‌లో విల్‌చైల్‌లను ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్‌లో ర్యాంపులు నిర్మించాలని దానివల్ల ఫిర్యాదు చేయడానికి వచ్చిన వికలాంగులకు అనువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నాయకులు జంగిలి శ్రీనివాస్, లక్ష్మణ్‌యాదవ్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లే చర్యలను అడ్డుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎర్రోజు శ్రీనివాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ అస్థిత్వంపై జరుగుతున్న దాడులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ జర్నలిస్టు పరాంకుశం వేణుగోపాలస్వామి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్ర – వర్తమాన పరిస్థితులు'అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి మాట్లాడుతూ... తెలంగాణ నీటి హక్కులను కాలరాసే విధంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లే ప్రభుత్వ చర్యలు ఏ రూపంలో ఉన్నా అడ్డుకోవాలన్నారు. నీటి పారుదల రంగంలో ఏపీ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ప్రాంతీయేతరుల పేర్లు పెట్టడంపై వికాస సమితి ఇప్పటికే నిరసన తెలిపిందని గుర్తు చేశారు.

◆ వికాస సమితి ప్రధాన కార్యదర్శి డా. ఎర్రోజు శ్రీనివాస్ మాట్లాడుతూ... ఏపీకి ఏ హక్కు లేకున్నా బనకచర్ల ప్రాజెక్టు పేరుతో గోదావరి జలాలను దోపిడీ చేసే కుట్ర చేస్తోందన్నారు. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నీటిని వినియోగించుకోవడానికి ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద 140టీఎంసీలను వినియోగించుకునే నీళ్లను నింపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ప్రొ. సీతారామారావు, రైతు విభాగం కన్వీనర్ పులిరాజు, మియాపురం రమేష్, పిండిగ వెంకన్న, గుడిసె రూబీస్టీవెన్ సన్, ప్రొద్దుటూరు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం అభిషేకం, ఆరాధన, తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

IN THE COURT OF THE HON'BLE XI ADDL CHIEF JUDGE
CITY CIVIL COURT, HYDERABAD
AT: HYDERABAD
O.S. No. 210 of 2025

Between:
1.SMT. M. KASTURI, W/o. Late M. Samba Murthy, Aged about 75 years, Occ: Housewife,
2. MANDALAPU RAMAKRISHNA, S/o. Late Mandalapu Samba Murthy, Aged about 49 years, Occ: Private Employee, Both are residents of H.No.1-3-183/40/91, SBI Colony, Gandhi Nagar, Hyderabad - 500 080. ...PLAINTIFFS

AND

1.The Tahsildar, Musheerabad Mandal, Hyderabad District, Telangana State
2. All Concerned ...DEFENDANTS

**NOTICE**

To
Please take notice that the above case is filed by the plaintiffs for declaration of legal heirs of the deceased M. Samba Murthy alias Mandalapu Samba Murthy, M. Srinivasa Murthy, and M. Ramadevi Consequently, to declare that the Plaintiffs are the owners of the suit schedule property being the legal heirs of the deceased M. Samba Murthy alias Mandalapu Samba Murthy, M. Srinivasa Murthy, and M. Ramadevi. The said suit is posted for appearance of defendant no. 2 i.e. all concerned parties on 11-07-2025 at 10.30 A.M. If any persons do not appear in person or through their counsel on the said date, the case will be heard and determined in your absence.
(BY THE ORDER OF THE COURT)
P.BUTCHI BABU, CH VIJAY KUMAR
J VENKATESH, ADVOCATES
Counsel for the Plaintiffs
FLAT NO.201, RANJIT TOWERS
DILSUKHNAGAR, HYDERABAD
Counsel for the Plaintiffs 9848283353